# కథ ఎలకనైనా కాకపోతిని...


డా॥ సమతరోష్ని

ఆదివారం... 'ఆవాజ్ దే కహా హో' నూర్జహాన్ పసందైన వింత గొంతు వినిపిస్తోంది. పాట విన్నంతసేపు గుండెల్లో తియ్యటి బాధ. ఎంత అద్భుతంగా పాడుతోంది...

మధ్యాన్నం రెండు గంటలవుతోంది. పక్కనే ఉన్న యూనివర్సిటీ నుంచి నా ఫ్రెండ్స్ వచ్చారు. నేనే పొద్దున్న ఫోన్ చేసి మట్టి దాకలో సీమపందికూర వండుతున్నానని చెప్పాను. అంతే బిలబిలమంటూ భోజనానికి పరుగెత్తుకొచ్చేసారు- పవన్, గోపి, మధు, శీతల్, అజయ్... వీళ్లంతా ఓ సంవత్సరంగా నాకు తెలుసు. మా స్నేహం వయసు చిన్నదైనా, వీళ్లంతా వయసులో నా కన్నా చిన్నవాళ్లయినా మేమంతా బాగ కలిసిపోయాం. ఇలాగే ఎప్పుడన్నా మట్టిదాకలో చేపల పులుసో, మరో స్పెషలో చేసినపుడు వాళ్లొచ్చి మా ఇంట్లో విందారగించడం మామూలే. నాకు వంట బద్ధకం వేసినపుడు వాళ్ల హాస్టలుకెళ్లి భోంచెయ్యడం అలవాటే... ఒక్కోసారి చాయ్ మీద చాయ్ తాగుతూ పిచ్చాపాటితో పాటు వివిధ అంశాల గురించి మాట్లాడుకోడం కూడ ఉంటుంది.

హాల్లో రెండు చాపలు వేశాం. వండిన వంటలు కిచెన్ నుంచి హాల్లోకి చేరేసాం. అన్నం, కూర, పప్పు, చారు, వడియాలు, పెరుగు తలో ఒకటి హాల్లోకి తెచ్చాం.

మా ఇంట్లో డైనింగ్ టేబుల్ లేదు. అందరం చాపల మీద గుండ్రంగా కూర్చుని పాటలు వింటూ, కబుర్లు చెప్పుకుంటూ, తింటూ సరదాగా గడిపేద్దామని మా ప్లాన్.



"అబ్బ! ఆకలి కరకరలాడుతోంది. కూర ఘుమ... ఘుమ... ఇక నేను తట్టుకోలేను" అంటూ పవన్ అందరికీ ప్లేట్లు సర్ది వడ్డించడం మొదలు పెట్టాడు. భోజనం హడావుడిలో పాటలు ఆగిపోయిన సంగతి గమనించ లేదు. ముబారక్ బేగం కేసెట్ ఆన్ చేసారు...

"కభీ తనహాయి యోం మే యూ పహర్ యాద్ ఆయెగీ" దేవుడా! ఏం haunting song! గుండెల్ని పిండేస్తోంది.

"కూర భలే బావుంది. ఇంత బాగ వంట చేయడం ఎక్కడ నేర్చుకున్నారు?" శీతల్ పొగిడింది.

"పొగడ్తలతో నా కడుపు నింపేసి కూరంతా మీరే తినేద్దామని కుట్ర పన్నుతున్నారా? నాక్కూడ కాస్త వేయండి" లేని కోపం తెచ్చుకుని దబాయించా.

"మంచి భోజనం... మంచి పాటలు... ఇంతకంటే ఏంకావాలి?" అజయ్ తన్మయత్వంలో మునిగిపోయాడు.

"మరీ ఇంత అల్పసంతోషివేంటి అజయ్! యంఫిల్ పూర్తి చేయాలి. పి.హెచ్.డి. మొదలుపెట్టాలి. ఎన్ని భవసాగరాలున్నాయి. ఇంకా ఈదడానికి..." శీతల్ ఇంకా ఏదో చెప్పబోయింది.

"అబ్బ అబ్బ అవన్నీ ఇప్పుడు గుర్తు చేయకు. ఈరోజు ఆదివారం. దేవుడు శుభ్రంగా విశ్రాంతి తీసుకోమన్నాడు. అదిగో పాటలు ఆగిపోయాయి. అదిగో పాటలు ఆగిపోయాయి. మళ్లీ నూర్జహాన్ కేసెట్ పెట్టండి" విసుక్కున్నాడు అజయ్.

"మళ్లీ నూర్జహాన్! ఏం గొంతు! ఏం పాటలు... ఏం మ్యూజిక్! ప్చ్... ఏం లాభం! ఇక్కడ ఉండకుండా పాకిస్తాన్ వెళ్లిపోయింది. అలా ఎందుకు వెళ్లిపోవాలి? ఏం బాలేదు" పవన్ ఊరకే వాపోతున్నాడు.

"ఎందుకలా అనుకోవాలి? అది ఆవిడ ఇష్టం. ఆవిడకి ఎక్కడ ఇష్టం అయితే అక్కడ ఉంటుంది. ఆవిడ మన దేశంలో లేదు అని ఆమెని, ఆమె పాటను ప్రేమించడం మానేస్తామా? బీటిల్స్, ఆచ్చా, కార్పెంటర్స్, మడోనా, మైకేల్‌జాక్సన్- వీళ్లందరూ మన దేశంలో లేరుగా... మరి వాళ్లు మనకు నచ్చడం మానేయలేదుకదా! ఎందుకో నాకు చాల ఆశ్చర్యం వేస్తుంది. మనం బాగ చదువుకున్నాం అభ్యుదయ భావాలు కలవారిగా ప్రచారం చేసుకుంటాం. కాని మన మనసుల్లో ఎక్కడో ఒక మూల ముస్లిం దేశాల పట్ల మనకే తెలియని, కనపడని శత్రుత్వం దాక్కొని ఉంటుంది. దీన్నించి సమూలంగా నివృత్తి పొందినవాడే నిజమైన అభ్యుదయవాది. అంతర్జాతీయవాది... అంతర్జాతీయం వరకు ఎందుకు? మన దేశంలోనే ఉన్న మన తోటి పౌరులందర్నీ మనం సమానంగా చూడగలుగుతున్నామా... లేదే... ఈ సమస్య ఎందుకంత సవాలై కూర్చుంది?" నేను క్లాసు తీయడం మొదలెట్టా...

"ప్లీజ్! మీరు మరీ సీరియస్ అయిపోతున్నారు. మాకు భయం వేస్తోంది" అంతవరకూ మౌనంగా ఉన్న గోపి మొత్తుకున్నాడు.

"సారీ! ఏంటో ప్రస్తుత పరిస్థితులు, నా పాత అనుభవాలు కొన్ని గుర్తు చేసుకుని, పోల్చి చూస్తే మన పయనం ఎటో తెలీడం లేదు. దేశాల మధ్య వివక్ష, జాతుల మధ్య వివక్ష, కులాల మధ్య వివక్ష. ఇక లింగ వివక్ష సరేసరి... future visionతో రవీంద్రుడు గీతాంజలిలో సరిహద్దుల్లేని ప్రపంచాన్ని కోరుకున్నాడో. ఇన్నేళ్ల తర్వాత కూడ దేశాలు ముక్కలైపోడాలు, విడిపోడాలు; దేశాల మధ్య యుద్ధాలు; జాతుల-కులాల మధ్య ద్వేషాలు తగ్గాయా? మనం ఎటు పోతున్నాం?!" ఎటో చూస్తూ ఉండిపోయాను- నేను ఏదో ఆవేశంలో ఉన్నానని వాళ్లు కూడ నిశ్శబ్దం అయిపోయారు. నేనే తేరుకుని భోజనం ముగించి గిన్నెలన్నీ వంటగదిలోకి తీసుకెళ్లా. మీలో ఇద్దరు గిన్నెలు కడిగేయండి. మరో ఇద్దరు లెమన్ టీ తయారుచేయండి. ఇంకో ఇద్దరు ఈ డబ్బాలో బిస్కెట్లు ప్లేట్లలో సర్ది హాల్లోకి తీసుకెళ్లండి...నా జీవితంలో జరిగిన రెండు, మూడు సంఘటనలు గుర్తుకొచ్చాయి.వాటి గురించి మీకు చెప్పాలని కుతూహలపడుతున్నాను.కాని ఆఫ్టర్ స్మాల్ బ్రేక్...మీకు అప్పగించిన పనులు పూర్తి చేసి హాల్లోకి రండి అని చెప్పాను. వాళ్ల వాళ్ల assignments పూర్తి చేసుకుని గురువుగారి కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల్లా హాల్లో కూర్చున్నారు... నేనో పెద్ద ఫొటో ఆల్బమ్‌ని తీసుకొచ్చి వాళ్ల మధ్య పెట్టి... నా టీ కప్పు చేతుల్లోకి తీసుకుంటూ చెప్పడం మొదలుపెట్టా.

నేను మెడిసిన్ చదివిన యూనివర్సిటిలో 110 దేశాల నుంచి వచ్చిన స్టూడెంట్స్ చదివేవాళ్లు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల

నుంచి వచ్చినవాళ్లు. ఒకోసారి పెద్ద ఫెస్టివల్‌లా జరిగేది... దాంట్లో ఈ దేశాల వాళ్లందరూ తమ తమ జాతీయ దుస్తులు ధరించి, తమ మాతృభాషలో పాటలు పాడుతూ, డేన్స్ చేస్తూ కను-చెవి విందు చేసే వాళ్లు. ఆ సాంస్కృతిక భిన్నత్వాన్ని చూసి ఆనందించాల్సిందే చెప్ప తరం కాదు. అన్ని దేశాల విద్యార్థులు ఒక్కచోట కలిసుండటం- ఒక మహాద్భుతం. మనమంతా ఒకే ప్రపంచానికి చెందినవాళ్లం. మన మధ్య స్నేహమేకాని భేదాల్లేవు అని అంతర్లీనంగా ఒక గొప్ప ఫీలింగ్. మళ్లీ రవీంద్రుడి రచన గుర్తుకొస్తోందిక్కడ. పాడమంటారా? tape recorder ఆపేసి వినండి. వాళ్ల జవాబు కోసం ఎదురుచూడకుండా "ఎక్కడయితే" అని మొదలుపెట్టి గీతం మొత్తం పాడాను. అందరూ నిశ్శబ్దంగా విన్నారు. బావుందని చప్పట్లు కొట్టారు.

నేను తెచ్చిన ఫొటో ఆల్బమ్‌ని వాళ్లకిచ్చి ఈ ఫొటోలో చూడండి. ఏ ఏ దేశస్తులున్నారో చెప్పగలరా? వెంటనే మధు అందరూ మనాళ్లె... ఇండియన్సే కదా... అంది. అవును. మనాళ్లే. ఇందులో పాకిస్తాన్ నుంచి వచ్చిన స్టూడెంట్స్ కూడ ఉన్నారు. మేమంతా కలిసిమెలిసి ఉండేవాళ్లం. పండగలన్నీ కలిసి చేసుకునేవాళ్లం. పాకిస్తాన్ శత్రుదేశం. ముస్లిం దేశం అనే ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. ఇది దాదాపు ముప్పై ఏళ్లక్రితం మాట... ప్రస్తుత పరిస్థితి చూస్తే భయం వేస్తోంది. మన మధ్య పెరుగుతున్న దూరం... ద్వేషం... పగ... దీన్ని పురోభివృద్ధి అనే అందామా? నేను చెప్పడం ఆపాను. వాళ్లు ఏం జవాబు చెప్పాలో తెలియదన్నట్టుగా బెంగగా నా వంక చూస్తున్నారు...

చెప్పడం కొనసాగించా... సరే అవి చదువుకునే రోజులు. చదువు పూర్తయాక స్వదేశం వస్తే పరిస్థితి ఎలా ఉంది?నేను పర్సనల్‌గా హర్ట్ అయిన సందర్భాలున్నాయి. నాకు ఉద్యోగం వచ్చినా, పి.జి.లో సీటు వచ్చినా, ప్రమోషన్ వచ్చినా నాకున్న రిజర్వేషన్‌వల్లే వచ్చిందని దెప్పి పొడవడం. మాకున్న రిజర్వేషన్ వల్ల తామంతా నష్టపోతున్నట్లు మా ట్లాడ్డం. కొన్ని వేల సంవత్సరాలుగా తినో, తినకో మీకు ఊడిగం చేసాం. మురిగ్గానే బతికాం. మా పరిస్థితిలో మార్పు రావాలనే కదా రిజర్వేషన్ ఇచ్చింది. అదీ 30 శాతమే కదా!? మాతో పోటీ పడకుండా మిగిలిన 70 శాతంలో మీరు సీట్లు తెచ్చుకోలేకపోతే మాకుబడి ఏడ్వడమెందుకు? జనాభా ప్రాతిపదికనైతే మాకింకా ఎక్కువ శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సి వస్తుందేమో ఆలోచించండి.

వాతావరణం మరీ గంభీరంగా తయారయ్యింది. 'క్షమించండి... కొంచెం ఎక్కువయినట్లుంది. ఇంకో రెండు చాయ్ తాగుదామా' అన్నాను. 'ఓ యస్' అంటూ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ టీ కప్పులు కడగటానికి, మళ్లీ టీ పెట్టడానికి లేచారు. Sorry! మిమ్మల్ని ఇబ్బంది పెట్టానేమో ఇంతవరకూ చెప్పింది ఒక చేదు అనుభవం అయితే దీనికి భిన్నంగా జరిగిన మరో సంఘటన కూడ చెప్పాలి...

ఉద్యోగంలో చేరిన తొలిరోజు. తెలంగాణాలో ఓ మారుమూల పి.హెచ్.సి.లో ఉద్యోగం. నాకా ఊళ్లో ఎవ్వరూ తెలీదు. స్టాఫ్‌కి, నాకు బాగానే సయోధ్య కుదిరింది. కలిసి బాగానే పని చేసాం. కాని అసలు విషయం అదికాదు. గ్రేస్ సిస్టరు గురించి చెప్పాలి మీకు. నేను ఉద్యోగంలో చేరింది శ్రావణమాసంలో. పూజలు... నోములు... హడావుడి. గ్రేస్ నా దగ్గరకొచ్చి 'శ్రావణ శుక్రవారం. ఈ ఊళ్లో అందర్నీ కలవొచ్చు, పదండి' అంటూ నన్ను తీసుకుపోయింది. ఈమె యస్.సి. కన్వర్టడ్ క్రిష్టియన్ ఈమెకెందుకింత హడావుడి అనుకున్నా. వెళ్లినచోటల్లా పూజ గదిలోక్కూడ మమ్మల్ని రానిచ్చారు. గ్రేస్ అందర్నీ సొంత బంధువుల్లా "వదినా! అన్నయ్య బావున్నాడా! పిల్లల చదువులెలా ఉన్నాయి అనో" లేధా 'కోడలు కన్నదా?బారసాల ఎప్పుడ'నో పలకరిస్తూ వాళ్లలో కలిసి పోయింది. నాకు ఆశ్చర్యంవేసింది. గ్రేస్‌కు ఇంకో వింత అలవాటుంది. ఆదివారం చర్చికి, శుక్రవారం లక్ష్మిపూజ దర్గాకెళ్లడం, గురువారం సాయిబాబా... ఆమె సర్వమత సామరస్యానికి ప్రతీకలా ఉండేది.

సరే నాకు చాల ఆశ్చర్యం వేసింది. ఇక్కడసలు అంటరానితనం లేదా?(మా పుట్టిన ఊళ్లో ఇలా లేదే అనుకున్నా) కారణం ఏమయి ఉండొచ్చు... నాకింకో విషయం గుర్తుకొచ్చింది. గ్రేస్ భర్త బ్రాహ్మిణ్. అందువల్ల తమలో కలుపుకుంటున్నారా? లేక ఈ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లతో ఎప్పుడయినా అవసరం పడొచ్చు అని కలుపుకుంటున్నారా? లేక నిజంగానే వాళ్లవి కల్మషం లేని స్నేహాలా? లేక మేం వెళ్లిపోగానే పసుపునీళ్లతో కడిగేసుకుని శుద్ధి చేసుకుంటారా? ఏది ఏమైనా మనుషులు తల్చుకుంటే ఏదైనా సాధించగలరనిపిస్తుంది... ముగించాను.

కాదు... కాదు... ఇంకో సంఘటన. అది ఈ మధ్యే జరిగింది. మా ఆయన ఆరోగ్యం బాగుండకపోతే డెప్యుటేషన్ మీద సిటీకొచ్చాను. డిపార్ట్‌మెంటులో అందరూ బాగ చదువుకున్నవాళ్లే. ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, ట్యూటర్లు. మాటల్లో ఎప్పుడూ కులప్రసక్తి వచ్చేది. మా కులం వారయితే ఇలా... మీ కులాల్లో ఎలా ఉంటుంది? ఇటువంటి చర్చలు తరచూ వచ్చేవి. నాకేంటో దిగులుగా ఉండేది. అలా అని లంచ్ అవర్లో తలో మూల కూర్చుని తినకుండా అందరూ కలిసి ఒక టేబుల్ దగ్గర కూర్చునేవాళ్ళం. తెచ్చిన కూర్లన్నీ అందరూ షేర్ చేసుకుని తినేవాళ్ళం. నా కూరలు బావున్నాయని అందరూ మెచ్చుకునేవారు. కాని ఒకాయన మాత్రం నా కూరలు ఎప్పుడూ వేసుకోలేదు. కేస్ట్ ఫీలింగు కాబోలు... నాదేం పోయిందిలే డోంట్ కేర్ అనుకున్నా.

అయితే ఒకరోజేమయిందో తెలుసా? 'తెలీదు' ముక్తకంఠంతో L.K.G. పిల్లల్లా అరిచారు నా స్నేహితులు. నాకు నవ్వొచ్చింది. విషాదంలో ప్రమోదం.

కాఫీ చేసుకోడానికని డిపార్టుమెంటులో పాలపొడి ఉంచేవాళ్లం. ఒకరోజు బీరువా తలుపులు సరిగా వెయ్యనందువల్ల కాబోలు ఎలుకలు ఆ పాలపొడి పాకెట్‌ని కొరికి పాడుచేసాయి. పొడంతా ఎలుక వాసన వస్తోంది. మలమూత్ర విసర్జనలు కనబడుతున్నాయి. ద్దాన్ని తీసి అవతల పారేద్దామని అనుకుంటుండంగా నా కూరలు తినడానికి ఎప్పుడూ భయపడే కొలీగ్ ఆ పాలపొడిని చక్కగా చప్పరిస్తూ- పాలపొడి తిండానికి కూడ టేస్టు బావుంది అంటూ లొట్టలేస్తున్నాడు. నాకు బాధ, అసహ్యం రెండూ తన్నుకొచ్చాయి. 'ఎలకనైనా కాకపోతిని... నేనొండినవి(కూరలు) నువ్ భోంచేయగా... అని పాడాలనిపిస్తోంది...' అని గట్టిగా నవ్వేసాను. నా యూనివర్సిటీ మిత్రులు కూడ నాతో శృతి కలుపుతూ "వద్దులెండి! ఇందాక పాడిన రవీంద్రుడి పాటే మరొక్కసారి పాడరూ! మేమూ నేర్చుకుంటాం" అన్నారు. బతిమాలారు...



నేను తెచ్చిన ఫొటో ఆల్బమ్‌ని వాళ్లకిచ్చి ఈ ఫొటోలో చూడండి. ఏప దేశస్తులున్నారో చెప్పగలరా? వెంటనే మధు అందరూ మనాళ్లె... ఇండియన్సే కదా... అంది. అవును. మనాళ్లే. ఇందులో పాకిస్తాన్ నుంచి వచ్చిన స్టూడెంట్స్ కూడ ఉన్నారు.

పాట సాగింది...

ఎక్కడ మనసు భయరహితంగా
తల ఎత్తి నిలబడగలదో!
ఎక్కడ జ్ఞానం స్వతంత్రమో!
ఎక్కడ విశాల విశ్వం
ఇరుకు గోడలతో
ముక్కలైపోదో! ఎక్కడ మాటలు
సత్యపు లోతుల్నుంచి వస్తాయో!
ఎక్కడ పరిపూర్ణత్వం కోసం
అవిశ్రాంత అన్వేషణ
కొనసాగుతుందో!
ఎక్కడ సహేతుక స్వచ్ఛప్రవాహం
సచ్చిన ఆచారాల ఇసుకదారుల్లో ఇంకిపోదో!
ఎక్కడ మేధస్సు నిత్యం
విస్తరించే ఆలోచన ఆచరణలలో నీ చేత
ముందుకు నడపబడుతుందో!
తండ్రీ! ఆ స్వేచ్ఛాస్వరం లోకి నా దేశాన్ని
మేలుకొలుపు!!!